::: "సుందరకాండ పఠనం" - శ్రీ అన్నమాచార్య సంకీర్తన ::: (17.11.2020)

01. పల్లవి : ఎటువంటి విలాసిని యెంతజాణ యీ చెలువ ।
తటుకన నీకు దక్కె దైవారఁజూడవయ్యా ॥ ॥ ఎటువంటి ॥

02. చరణం : మగువ మాటాడితేను మాణికాలు నిండుకొనీ ।
పగడాలు పెదవులఁ బచ్చిదేరీని ।
మగిడి చూచితేను మంచినీలా లుప్పతిలీ ।
తగు నీకు నీపెదిక్కు తప్పక చూడవయ్యా ॥ ॥ ఎటువంటి ॥

03. చరణం : పడఁతి జవ్వనమునఁ బచ్చలు గమ్ముకొనీని ।
నడచితే వైడూర్యాలు వెడలీ గోళ్ళ ।
తొడిఁబడ నవ్వితేను తొరిగీని వజ్రాలు ।
వొడికమైనది యీపెవొరపు చూడవయ్యా ॥ ॥ ఎటువంటి ॥

04. చరణం : కొమ్మ ప్రియాలతేనెలఁ గురిసీఁ బుష్యరాగాలు ।
కుమ్మరించీఁ జెనకుల గోమేధికాలు ।
ముమ్మురపుఁజెమటల ముత్తెపుసరాలు నిండీ ।
నెమ్మది శ్రీ వేంకటేశ నీ దేవిఁ జూడవయ్యా ॥ ॥ ఎటువంటి ॥

- - -